# చీమ కత

**చీ**మ...

చీమట గోరమైన తపస్సు చేయడాని
కెళ్ళిందట.
అయితే తపస్సు ఎలగ
చేసిందీ?
ముందు అరిటాకులు
పెట్టిందట. అరిటాకు
మీద సూదులు గుచ్చిం
దట. సూదుల మీద
తమలపాకు పెట్టిందట.
తమలపాకుమీద పోకచెక్క
పెట్టిందట. దని మీద బుర్ర
పెట్టిందట. కాళ్ళు మీదకి పెట్టిందట.
పెట్టి తపస్సు చేస్తందట ఘోరాతి
ఘోరంగా...
తల్లకిందల తపసు చేస్తుంటే-
ఈవైకుంతమూ గజగజలాడిపోయింది.
ఈ బ్రహ్మపట్నమూ సత్యలోకమూ
గజగజలాడిపోయింది.



ఆ కైలాసమూ
గజగజలాడిపోయింది.
మన నరలోకమూ
గజగజలాడిపోయింది.
'ఏమిసేతుమూ? ఏటి?
సీమ సూస్తే ఇంతది..
ఇది గోరమైన తపసు
సేసస్తంది' అని
బ్రహ్మదేవుడట
పిలిచినాడట. ఎవుర్నీ..
చీమనికాదు, సరస్వతీదేవిని...
'వాణీ...వొక్కసారి ఆ సీమ తపసు
సూడు. ఎంత గోరంగసేస్తంది.
అది ఏటి కోరెస్తాదో? ఆ
మనసులోన ఒక్కసారి
నిలబడు తల్లీ' అని చెప్పేడట.
చెప్పితే, సరస్వతీ దేవి ఆ చీమ
మనసులో నిలబడ్డాదట.

అప్పుడు బ్రహ్మదేవుడు - విష్ణుమూర్తి, శంకరుడినీ తీసుకొని త్రిమూర్తుల్లాగ ఎళ్ళారు. ఎళ్ళి-
'తల్లి నీవు సేసిన తపసుకి మెచ్చినాము. నీకేం వరం కావాలో కోరుకో' అన్నారట.

ఎవులికీ?

ఇంకెవులికి... చీమకి!

చీమేటన్నాదటా?

'ఈ నరమానవులతోటి నలిగిపోతన్నాను, నీను ఎవులికి కరిసినా సచ్చిపోవాల' అని కోరిందట.

చిత్తరాంగి చీమ!?

తల్లి శారదాంబ వున్నాది కదా... అలగే అర్థం పలికించీసింది మరి. ఇవతల వరాలిచ్చీడానికి శివుడు గాబరయి పోతన్నాడు కదా... అడగ్గానే తదాస్తు అని ఇచ్చిసినాడు వరము!

అయితే ఆవరమే శాపమయిపోయింది!

'నీను ఎవులికి కరిసినా చచ్చిపోవాలి'

అన్నట్టుగానే చీమ కరిసీ కరడంతోటే మనచెయ్యి పడితే సేన,దని బతుక్కి.. నలిగి చచ్చిపోతంది. అప్పుడు నుంచి ఇప్పుడుదాకా.

